క్లుప్తంగా

స్టాండింగ్ కౌన్సిల్ నియామకాలకు దరఖాస్తులు

చీరాల: చీరాల పురపాలక సంఘంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నియామకాలకు అర్హత గల బార్ ఆసోసియేషన్ మెంబర్లు ఈనెల 17వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీలను పేపరు మీద బయోడేటాతో పాటు వివరాలు నమోదు చేసి దాఖలు చేయాలని, ఈ నియామకాలు మూడేళ్ల కాలానికి ఉంటుందని ప్రకటనలో చెప్పారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం



పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

చీరాల: దూరప్రాంతాల నుంచి సముద్రతీరానికి వచ్చే పర్యాటకులు పోలీసులు సూచించిన నిబంధనలు పాటించాలని ఈపురుపాలెం ఎస్సై శివాంజనేయులు తెలిపారు. చీరాల ఓడ రేవుకు వచ్చే పర్యటకులకు సోమవారం అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి సముద్ర స్నానాలు చేయరాదన్నారు. లోతట్టు ప్రాంతాల్లో మునగరాదని తెలిపారు. లేని ప్రక్షంలో ప్రమాదాల బారిన పడతారని హెచ్చరించారు. సముద్ర తీరానికి వచ్చే పర్యాటకుల వాహనాలను ఆయన పరిశీలించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

అద్దంకి రూరల్: ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రేమ్ ఐ కేర్ వైద్యశాల వైద్యశాల వైద్యుడు జి. షాలేంరాజు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బంగ్లారోడ్‌లోని వైద్యశాల వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 450 మందికి పరీక్షలు నిర్వహించి 200 మందికి ఉచిత మందులు అందించారు. 55 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో డాక్టర్ గొట్టిపాటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధితో బంగారు భవిష్యత్



వేటపాలెం: సుకన్య సమృద్ధి యోజన పథకంతో బాలికలకు బంగారు భవిష్యత్ ఉంటుదని పట్టబద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు అన్నారు. ఎస్ఎస్ఏ పథకం ద్వారా పోస్టాఫీస్‌లో ఉచితంగా ఖాతా ప్రారంభించడానికి పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో రూ.25 వేలు నగదు పోస్టుమాస్టర్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటపాలెం గ్రామంలో ఆడపిల్లల తల్లిదండ్రులు 100 మంది ఆడపిల్లలకు రూ. 250 చొప్పున ఖాతా ప్రారంభించడానికి నగదు అందజేశామన్నారు. ఈ పథకం ద్వారా తల్లిదండ్రులు ఆడ పిల్లలకు ప్రతి నెలా అకౌంట్ కొంత మొత్తం వారి పేరుతో జమ చేయడం ద్వారా భవిష్యత్‌లో ఉపయోగ ఉంటుందన్నారు. కార్యక్రమంలో రేష్మా, సంఘం సభ్యులు రావి మస్తాన్‌రెడ్డి, చుండూరు మురళీ కృష్ణ, హరిప్రసాద్, పూల శ్రీను, రవికుమార్, కట్టా తేజ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ



పర్చూరు (చినగంజాం): పర్చూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్సపొందుతున్న రోగులకు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణ మోహన్ సోమవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆయన తల్లి తోకల సుబ్బాయమ్మ జ్ఞాపకార్థం ఆసుపత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేసినట్లు కృష్ణమోహన్ తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది సూచన మేలకు 10 థర్మామీటర్‌లు ఆసుపత్రికి సమకూర్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, హెడ్ నర్స్ రత్నకుమారి, రోటరీ సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్, కోట శ్రీనివాసరావు, సత్యనారాయణ, అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీగా సుమంత్

జే.పంగులూరు: మండల ఈవోపీఆర్డీగా సోమవారం కే సుమంత్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన వలేటివారిపాలెం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉంటూ సత్వరమే సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నాడు.

నేటి నుంచి పంచాయతీల నిర్వహణపై శిక్షణ

జే.పంగులూరు: నేటి నుంచి రెండు రోజుల పాటు పంచాయతీల నిర్వాహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే స్వరూపరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు రోజుల పాటు శిక్షణ ఉంటుందని, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ కార్యాచరణ ప్రణాళికలో భాగంలో జరగన్నుట్లు తెలిపారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని ప్రకటనలో తెలిపారు.

నియోజకవర్గాల వారీగా కౌలు రైతు కార్డులు ఉన్న రైతులు	
అద్దంకి	3800
జే.పంగులూరు	2350
సంతమాగులూరు	2700
బల్లికురవ	2241
కొరిశపాడు	2300



పంగులూరు ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ వద్ద పంట రుణాలు అడుగుతున్న కౌలు రైతులు (ఫైల్)

కౌలు రైతుకు.. కూటమి దెబ్బ

- కౌలు రైతులకు అందని పంట రుణాలు
- రుణాలు ఇవ్వమంటున్న బ్యాంకులు
- సహకార బ్యాంక్‌లనుంచైనా రుణాలు ఇవ్వాలి
- కౌలు రైతులను ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

జే.పంగులూరు: గత ఐదేళ్లలో వ్యవసాయం లాభసాటిగా మారడంతో రైతన్నలు సంతోషంగా ఉన్నారు. ఈఏడాది కూడా అలాగే ఉంటుందని భావించిన రైతన్నలకు కూటమి ప్రభుత్వ రూపంలో దురదృష్టం ఎదురైంది. దీనికి తోడు వరుణుడు సైతం కరుణించకపోవడంతో రైతుల కష్టాలు రెట్టింపయ్యాయి. కనీసం రైతులకైనా పంటరుణాలు, ఆర్థిక సాయం అయినా చేస్తుందిలే అనుకున్న రైతులు ఆశలు అడియాసలయ్యాయి. సాగర్ జలాలు రావడంతో ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం కురిసి వర్షాలకు పత్తి పూత, పిందె మీద ఉంది. మిరప పైరు కూడా బాగానే ఉంది. ఈతరుణంలో సాయం చేయాల్సిన ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది.

కౌలు రైతులను నట్టేట ముంచిన కూటమి..

చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు రైతులను భరోసా రూ. 20 వేలు, కౌలు రైతులకు సున్నావడ్డీకి పంట రుణాలు అని తప్పుడు వాగ్దానాలు ఇచ్చి రైతులను మోసం చేశాడు. అ మోసపూరిత వాగ్దానాలతో ప్రభుత్వం ఏర్పడిన నాలుగు మాసాలు దాటిన ఇంకా అ అబద్దపు మాటలు మానుకోవడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం కౌలు రైతులకు వడ్డీలేని పంటరుణాలను ఇస్తామని చెప్పి సంబంధిత బ్యాంకులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇది నమ్మిన కౌలు రైతులు చాలా సంతోషించారు. పంట సీజన్ ఆరంభంలోనే రైతులు కౌలు రైతులకు దరఖాస్తు పెట్టుకున్నారు. అనంతరం కౌలు కార్డులు చేతికి రాగా దానిని తీసుకొని బ్యాంక్‌ల వారి వద్దకు రుణాల కోసం వెళ్లారు. ఈ కార్డుల ద్వారా లోన్లు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పారు. గతంలో కౌలు రైతులు వేసుకొనే పొలంపై యజమాని రుణం తీసుకున్నాడని అందువలన రెండుసార్లు ఇవ్వడం కుదరదని చెప్పడంతో రైతులు కంగుతిన్నారు. దానితో పాటు ఇతరత్రా కారణాలు చెప్పి రుణాలు ఇవ్వకుండా బ్యాంకులు ఎగురగొడుతున్నాయి.



సాగు చేస్తున్న పత్తి పంట

పంటసాగుకు అధిక వడ్డీలకు అప్పులు..

కౌలు రైతులకు బ్యాంక్‌లు పంట రుణాలు ఇవ్వడం వీలు పడదని తేల్చి చెప్పడంతో రైతులు బయట నుంచి అప్పులు తీసుకువచ్చి సాగుచేయడానికి సిద్ధం అయ్యారు. కొంత మంది కౌలు రైతులు అధిక వడ్డీలు కట్టలేక అప్పుల పాలవుతున్నారు. దీంతో అప్పులు ఎక్కువవుతుండటంతో వడ్డీ ఎలా కట్టాలో భయాందోళనలో ఉన్నారు. ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా కాకపోయినా కనీసం సొసైటీల ద్వారానైనా కౌలు రైతుకు రుణాలు ఇప్పించమని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రుణాలు ఇస్తేనే బయటపడతాం..



నేను ఒక ఎకరా పొలం కౌలు తీసుకున్నాను. బ్యాంకులు రుణాలు ఇస్తాయనుకొని ఎదురు చూశాం. ఇంతవరకు ఇవ్వలేదు. ఇప్పుడు పొలం కౌలుకు ఎందుకు తీసుకున్నా అని బాధపడుతున్నాను. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, పంట రుణాలు ఇస్తే కౌలు రైతులకు కొంత ఊరట లభిస్తుంది.

– ఎస్.సామ్యేలు, పంగులూరు

సొసైటీల ద్వారా అయినా రుణాలు ఇప్పించండి



చంద్రబాబు ప్రభుత్వం కౌలు రైతులను పూర్తిగా వదిలేసింది. తప్పుడు వాగ్దానాలతోనే కాలం వెళ్లబుచ్చుతోంది. బ్యాంకులు రుణాలు ఇవ్వమని తేల్చి చెప్తున్నాయి. ప్రభుత్వం స్పందించి సొసైటీల ద్వారానైనా రుణాలు మంజూరు చేయాలి.

– రాయిని వినోద్‌బాబు, జిల్లా కౌలు రైతు అధ్యక్షుడు

కౌలు రైతుల్లో ఎక్కువ శాతం దళితులే..



నియోజకవర్గంలో ఎక్కువ శాతం కౌలు రైతులే. వీళ్లలో ఎక్కువ శాతం దళితులే సాగుచేస్తున్నారు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోతారు. భూయజమానితో సంబంధం లేకుండా, డబుల్ ఫైనాన్స్ అని చెప్పకుండా రుణాలు వెంటనే అందించాలి.

– తల్లపనేని రామారావు, మండల రైతు సంఘం నాయకుడు

ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి..



ఈఏడాది నేను ఎకరా పొలం కౌలుకు తీసుకున్నాను. అధికారులు కౌలు రైతు కార్డులను మంజూరు చేశారు. వాటిని తీసుకొని బ్యాంక్‌కు వెళ్లి రుణం అడిగితే ఇవ్వమని చెప్పారు. ఇప్పుడు పొలంలో ఎరువులు, మందులు వేయాలి. ఎక్కడి నుంచి తేవాలో అర్థం కాని స్థితిలో ఉన్నాను.

– కే సుబ్బారావు, పంగులూరు

శక్తిస్వరూపిణీ.. మహాచండీదేవి



వేటపాలెం అన్నపూర్ణదేవి అలంకరణలో..



చినగంజాం రామకోటేశ్వర ఆలయంలో అమ్మవారు



కారంచేడు హరేరామ ఆశ్రమంలో అమ్మవారు



జాగర్లమూడిలో ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారు



చెన్నుపల్లిలోని పార్వతిదేవి అమ్మవారు

- ఐదో రోజు వైభవంగా దసరా శరన్నవరాత్రులు
- మహాచండీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

కారంచేడు/పర్చూరు/యద్దనపూడి/చినగంజాం/మార్టూరు: శక్తి స్వరూపిణియైన మహాచండీదేవిని పూజిస్తే దుష్టశక్తులు నశించి, సకల శుభాలు, ఫలితాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అమ్మవారిని ప్రార్థిస్తే కీర్తి, విద్య, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారుతాన్న ప్రతితీ ఉంది. దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు ఐదో రోజు మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. గ్రామంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వేణుగోపాల స్వామి గుడి, పెదబజారు శివాలయం, హరేరామ విశిష్ట ఆశ్రమం, వెంకటేశ్వరస్వామి వారి గుడి, సాయి మందిరం, కట్టమల్లేశ్వరస్వామివారి గుడి, స్వర్ణ వెంకటేశ్వరస్వామివారి ఆలయం, గంగమ్మగుడి, శివాలయం, వల్లభరాయస్వామివారి ఆలయం, తిమిడెదపాడు భ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారిని సరస్వతిదేవిగా ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు.

– పర్చూరు మండలంలోని నూతలపాడు గ్రామంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో అమ్మవారు సోమవారం మహాచండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలలో బత్తిన శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం వీరన్నపాలెం వేణుగోపాలస్వామి భజన సమాజం ఎడ్వర్డ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నూతలపాడు ఉత్సవ సమితి ఆదిపూడి మోహనకృష్ణ, వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగంగుంట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

– చినగంజాం మండలంలోని సోపిరాల లలితా రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో లలితాంబ అమ్మవారిని మహాచండీ దేవి అవతారంలో అలంకరించారు. గ్రామానికి చెందిన నరహరి హనుమంతరావు దంపతులు పూజా కార్యక్రమాలలో పాల్గొనగా ఆలయ పూజారి శంకరమంచి హనుమంతరావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చినగంజాం వాసవీ కన్యకాపరమేశ్వరీ, రైల్వేస్టేషన్ విజయ కనకదుర్గభవానీ ఆలయంలో అమ్మవారిని మహాచండీదేవి అలంకారంలో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అన్నపూర్ణేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు..

వేటపాలెం: దసర శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కన్యకాపర మేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. గడియార స్తంభం సెంటర్‌లో గల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారిని చంద్రప్రభ వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రికి భీమ్లానాయక్ సాంఘిక నాటక ప్రదర్శన ఆహుతులను అలరింప జేశాయి. ఆణుమల్లిపేటలో బతుకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్యేక పూజలు చేసిన మహిళలు..

అద్దంకి రూరల్/మేదరమెట్ల/బల్లికురవ: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. బల్లికురవ, కొరిశపాడు మండలం మేదరమెట్ల మిద్దెలడొంక రోడ్డులో గల కనకదుర్గ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ఐదవరోజైన సోమవారం మహాచండీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

– అద్దంకి పట్టణంలోని భీమలింగేశ్వరస్వామి దేవస్థానం, వింధ్యాసమేత శ్రీనగరేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. ఐదోరోజు ఆయా దేవాలయాల్లోని పార్వతి అమ్మవార్లను అర్చకులు అన్నపూర్ణా దేవిగా, లలిత్రిపుర సుందరీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో, ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారిని అన్నపూర్ణేశ్వరీదేవి దేవిగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కారంచేడులో వైష్ణవీ దుర్గామాతగా అమ్మవారు



మేదరమెట్లలో మహాచండీదేవిగా అలంకరించిన భక్తులు



వేటపాలెం: చంద్రప్రభ వాహనంపై వెంకటేశ్వరస్వామి..



అద్దంకి పాత శివాలయంలో లలిత త్రిపురసుందరీదేవిగా



మార్టూరు లలిత త్రిపురసుందరీదేవి అలంకారంలో..

సిమెంట్ దిమ్మెను ఢీకొన్న ఆటో, బైక్



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న హైవే పోలీసులు

మేదరమెట్ల: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. నిద్రమత్తు కారణంగా ట్రాలీ ఆటో సిమెంట్ దిమ్మెను ఢీకొట్టడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలం పీ.గుడిపాడు జాతీయరహదారిపై జరిగింది. అందిన వివరాల మేరకు.. ట్రాలీ ఆటో ఏలూరు నుంచి నెల్లూరు వెళ్తోంది. ఈక్రమంలో ట్రాలీ ఆటో గుడిపాడు జాతీయర హదారిపైకి రాగానే అదుపుతప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొంది. డ్రైవర్ జయమంగళ పరమ గీతరాజు గాయాలయ్యాయి.

మరో ప్రమాదంలో ఇరువురికి గాయాలు

బొల్లాపల్లికి చెందిన మురికిపూడి మంజు, మురికిపూడి రమేష్ అనే ఇద్దరు కలిసి మోటారు బైకుపై మేదరమెట్ల వైపు నుంచి బొల్లాపల్లికి వస్తున్నారు. బైకు అదుపుతప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ఇరువరికి రక్తగాయాలయ్యాయి. కాగా క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో చిలకలూరిపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈరెండు ప్రమాదాలు సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకున్నాయి. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుండ్లకమ్మ నదిని కాపాడాలని వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

అద్దంకి: గుండ్లకమ్మను కాపాడి భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు స్నానఘట్టాలు నిర్మించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు మహిళలు సోమవారం వినతి పత్రం అందజేశారు. సోమవారం దసరా శరన్నవరాత్రి వేడుకలకు స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి వద్దకు వచ్చిన మంత్రికి కన్యకా పరమేశ్వరి మహిళ భక్తజన బృందం వినతి పత్రం అందజేసింది. కార్తీక మాసం సందర్భంగా స్నానమాచరించడానికి అద్దంకి పట్టణం వైపు నుంచి గుండ్లకమ్మ వంతెనకు ఇరువైపులా రెండు స్నాన ఘాట్‌లు, పాత గాంధీ బొమ్మ సెంటర్ దారి, నర్రావారిపాలెం వైపున కలుపకొని మొత్తం నాలుగు స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారం కోసం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు, శింగరకొండ ఈవోను ఆదేశించారు. వినతి పత్రం అందజేసిన వారిలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, వాసవీ వనితా క్లబ్ అధ్యక్షుడు గ్రంధి నాగరాజు కుమారి, రమాసుందరి, చండూరు కాళీ తదితరులు ఉన్నారు.

రామారావుకు విశిష్ట సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రామారావు

చినగంజాం: ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్కాపురం వెంకట రామారావుకు విశిష్ట సేవా పురస్కారం ఇందజేశారు. ఇటీవల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులో ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమం ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేశారు. న్యాయ శాఖ రిటైర్డ్ సీనియర్ సూపరింటెండెంట్ అయిన ఆయన సంఘంలో రాష్ట ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయనకు పురస్కారం అందజేసిన వారిలో కన్వీనర్ నాదెండ్ల రాఘవ, ప్రెసిడెంట్ పతకమూరి మధుబాబు, సెక్రటేరియట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల కట్టడి కోసమే కమిటీలు




మాట్లాడుతున్న సీడీపీవో సుధ

బల్లికురవ: బాల్య వివాహాల కట్టడి కోసమే కమిటీలను వేసినట్లు సీడీపీవో డీ సుధ పేర్కొన్నారు. సోమవారం బల్లికురవలో మండల స్థాయి బాల్య వివాహాల కట్టడి నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సీడీపీవో కమిటీ బాధ్యతలు, బాల్య వివాహ చట్టాల గురించి వివరించారు. ఆడపిల్లలకు, మగ పిల్లవానికి 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేసుకోకూడదన్నారు. అలాంటి పెళ్లి చేసిన వారికి, చేసుకున్న వారికిపెద్దలు చట్టరీత్యా శిక్ష పడుతుందని చెప్పారు. ఇదంతా పరిణితి చెందని వయసులో వివాహాలు చేయడం వలన కలిగే ముప్పును తప్పించడం కోసమేనని వివరించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు తెలుసుకుని బాల్య వివాహాలను చేయకుండా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఎంఈవో పాల్గొన్నారు.

ఘనంగా భావన్నారాయణుని బ్రహ్మోత్సవాలు

చినగంజాం: స్థానిక శ్రీదేవి, భూదేవీ సమేత భావన్నారాయణస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం శ్రీవారికి విశేష పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. స్వామివారికి గరుడోత్సవం కార్యక్రమాన్ని, రాత్రి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో భావన్నారాయణస్వామి మహిళా కోలాట బృందం, లలితారామకోటేశ్వర మహిళా కోలాట బృందం వేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూజా కార్యక్రమాలను పరాశరం రామాచార్యులు, పవన్‌లు నిర్వహించగా, గ్రామోత్సవంలో భక్తులకు మోహన లక్ష్మీనరసింహాచార్యులు హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భావన్నారాయణుడి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

యాజమాన్య నిర్ణయాలు సరికాదు



మాట్లాడుతున్న సంఘ నాయకుడు నాగేశ్వరరావు

అద్దంకి: బీమా రంగంలో పాలసీదారులకు, ఏజెంట్లకు నష్టాన్ని చేకూరుస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలు వెంటనే ఉపసంహరించుకోవాలని లియాఫీ–1964 నాయకులు డిమాండ్ చేశారు. కనీస బీమా రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలు చేయడంపై సోమవారం లియాఫీ నాయకులు అద్దంకి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మాధవకృష్ణకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా లియాఫీ అద్దంకి బ్రాంచ్ అధ్యక్షుడు వల్లం నాగేశ్వరరావు మాట్లాడుతూ బీమా రంగంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈనిర్ణయాల వల్ల సన్న, చిన్నకారు కుటుంబాలు బీమా సౌకర్యం కోల్పోవడంతో పాటు, ఏజెంట్లకు కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఎల్ఐసీ యాజమాన్యం వెంటనే స్పందించి వారు తీసుకున్న నిర్ణయాలు ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లియాఫీ సెంట్రల్ సెక్రెటరీ మెంబర్ చుండూరి నరసింహారావు, మురళీకృష్ణ, త్రిమూర్తులు, వీరాస్వామి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.